సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 1 । ఆగస్టు । 2023



ఫిర్యాదులను పరిష్కరించాలి

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 69 ఫిర్యాదులు నమోదయ్యాయి.
- 8లో ▸



నిర్మాణాలను పూర్తి చేస్తాం

అధికారంలోకి వస్తే అసంపూర్తిగా ఉన్న 'డబుల్' ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేస్తామని కాంగ్రెస్ నేత సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు.
- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.8 /23.3

ఉదయం ఆహ్లాదకర గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అడపాదడపా జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'రూ. లక్ష సాయానికి దరఖాస్తు చేసుకోండి'

కామారెడ్డి అర్బన్: మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా క్రైస్తవులకు 100 శాతం సబ్సిడీతో రూ.లక్ష సాయం అందించనున్నారు. అర్హులైనవారు ఈనెల 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ – సీ కుల ధ్రువీకరణ పత్రం లేదా బాప్టిజం ధ్రువీకరణ పత్రం ఉన్న 21 నుంచి 55 ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకోసం కలెక్టరేట్‌లోని మైనారిటీ సంక్షేమాధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

డిగ్రీ కళాశాల తరగతులు ప్రారంభం

మద్నూర్: మండల కేంద్రంలోని రాంసుఖ్ బాల్‌ముకుంద్ ఇనాని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ప్రారంభించనున్నారు. ఎమ్మెల్యే హన్మంత్ సింధే కాలేజీని ప్రారంభిస్తారని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.

టమాట @ 200

నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటలో సోమవారం జరిగిన వారాంతపు సంతలో కిలో టమాటల ధర రూ. 200 పలికింది. ఇటీవలి కాలంలో టమాట ధర రూ. 120 నుంచి రూ. 150 వరకు పలుకుతోంది. కానీ వారాంతపు సంతలో రూ. 200లకు విక్రయించారు. దీంతో చాలామంది టమాట కొనుగోలు చేయకుండానే వెనుదిరిగారు.



సంతలో టమాటాలు విక్రయిస్తున్న దృశ్యం

ఎన్నికలకు సన్నద్ధం!


- ఏర్పాట్లు చేసుకుంటున్న అధికారులు
- అవసరమైన అధికారులు, సిబ్బంది జాబితాల తయారీలో బిజీబిజీ
- ఇప్పటికే పోలీసు, రెవెన్యూ శాఖల్లో కొలిక్కి వచ్చిన బదిలీలు

సాక్షి, కామారెడ్డి: శాసనసభ ఎన్నికల నిర్వహణ కోసం జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. కేంద్ర ఎన్నికల కమిషన్ సూచనలకు అనుగుణంగా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 790 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆయా కేంద్రాలలో అవసరమైన సౌకర్యాల కల్పన పనులు సాగుతున్నాయి.

పెరిగిన హడావుడి

ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లలో యంత్రాంగం నిమగ్నమైంది. కలెక్టరేట్‌లో ఎన్నికల విభాగంలో హడావుడి కనిపిస్తోంది. జిల్లాలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల నిర్వహణకు అవసరమైన అధికారులు, సిబ్బంది కోసం వివరాలు సేకరిస్తున్నారు. శాఖల వారీగా ఉద్యోగులు, అధికారుల వివరాలు, అలాగే పోలింగ్ నిర్వహణ కోసం అవసరమైన ఉద్యోగుల గురించి లెక్కలు తీస్తున్నారు. ఓటర్ల జాబితాల గురించి రాజకీయ పార్టీలతో పలుమార్లు సమావేశాలు జరిగాయి. ఈవీఎంల పనితీరు గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. 18 ఏళ్లు నిండినవారిని ఓటర్లుగా నమోదు చేయించేందుకు ఈనెల 26, 27 తేదీలతో పాటు సెప్టెంబర్ 2, 3 తేదీల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. ఈనెల 21న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించడంతోపాటు అక్టోబర్ 4న తుది జాబితా ప్రకటించేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

ఎన్నికల నేపథ్యంలో..



ఎన్నికల నిర్వహణలో కీలకమైన రెవెన్యూ, పోలీసు శాఖల్లో అధికారుల బదిలీల ప్రక్రియ దాదాపు పూర్తయ్యింది. మూడేళ్లకుపైగా ఒకే స్థానంలో పనిచేస్తున్న వారిని, సొంత జిల్లాల్లో పనిచేస్తున్న ఎస్సైలు, సీఐలు, తహసీల్దార్లు, ఇతర అధికారులను పొరుగు జిల్లాలకు బదిలీ చేశారు. వారి స్థానంలో కొత్త అధికారులు వచ్చి చేశారు. ఐదేళ్లపాటు జిల్లాలో పనిచేసిన అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) వెంకటేశ్ ధోత్రేకు స్థానచలనం కలిగించారు. ఏఎస్పీ అన్యోన్య ఏసీబీ ఎస్పీగా పంపించారు. కామారెడ్డి డీఎస్పీ బదిలీ అయ్యారు. ఎల్లారెడ్డి ఆర్డీవో శ్రీను, బాన్సువాడ ఆర్డీవో రాజుగౌడ్‌లు జిల్లాలో మూడేళ్లకుపైగా పనిచేయడంతో వారినీ బదిలీ చేశారు. పోలీసు శాఖలో సొంత జిల్లాలో పనిచేస్తున్న ఇరవై మందిని రాజన్న జోన్ పరిధిలోని సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాలకు పంపించారు. తహసీల్దార్ల బదిలీలు జరుగుతున్నాయి.



ఈవీఎంల పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్ (ఫైల్)

పార్టీలతో సమావేశాలు..

ఎన్నికల నిర్వహణ కసరత్తులో భాగంగా జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈవీఎంల పనితీరు గురించి వివరిస్తూ వారి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ఓటర్ల జాబితాలు, నమోదు ప్రక్రియ గురించి కూడా వారికి అవగాహన కల్పించడంతో పాటు వారితో చర్చిస్తున్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాతో పాటు తుది జాబితాల గురించి వివరిస్తున్నారు. ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ ఎప్పుడు వెలువడినా సిద్ధంగా ఉండేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

'పోచారం'లోకి 2,118 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టులోకి సోమవారం 2,118 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు నుంచి 20 క్యూసెక్కుల నీటిని ప్రధాన కాలువలోకి విడుదల చేస్తున్నామన్నారు. 2,098 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు అలుగు పైనుంచి దిగువకు ప్రవహిస్తోందని పేర్కొన్నారు.

'ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి'



ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న తపస్ నాయకులు

కామారెడ్డి టౌన్: విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలనితపస్ జిల్లా అధ్యక్షుడు పుల్లం రాఘవరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం తపస్ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయ ఏవోను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చాక ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలు మరింత పెరిగాయన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి వల్ల ఉపాధ్యాయు లు మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర కార్యదర్శి మ్యాక రాంచంద్రం, జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు రాములు, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్‌లోకి పెరిగిన వరద



ప్రాజెక్టు గేటు ద్వారా విడుదలవుతున్న నీరు

నిజాంసాగర్: ఎగువన కురుస్తున్న వర్షాలతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో పెరిగింది. సోమవారం రాత్రి 4,800 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి అంతే నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు. అలాగే జుక్కల్ మండలంలోని కౌలాస్ ప్రాజెక్టులోకి 635 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి 1,312 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు అధికారులు తెలిపారు.

నెరవేరిన ఆర్టీసీ కార్మికుల కల..

- తీపి కబురు చెప్పిన సర్కారు
- ప్రభుత్వంలో సంస్థ విలీనం ప్రకటన
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు



నిజామాబాద్ డిపో–1 వద్ద టపాకాయలు కాల్చి సంబురాలు చేసుకుంటున్న ఆర్టీసీ కార్మికులు

సాక్షి, కామారెడ్డి: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్‌ఆర్టీసీ)లో పనిచేస్తున్న కార్మికులకు సర్కారు తీపి కబురు చెప్పింది. సంస్థను ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు ప్రకటించింది. ఆర్టీసీని రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించనున్నారు. దీంతో ఆర్టీసీ కార్మికుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఆర్టీసీ డిపోల్లో పనిచేస్తున్న సుమారు 2,800 మంది కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారనున్నారు.

ఆర్టీసీ కార్మికులు అరకొర వేతనాలతో అవస్థలు పడుతున్నారు. తమనూ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని చాలా ఏళ్లుగా కోరుతూ వస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో సంస్థ ఉద్యోగులు అగ్రభాగంలో నిలిచి పోరాడారు. సకల జనుల సమ్మెకు మద్దతుగా నిలిచారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తారని ఆశించినా.. ఆశ నెరవేరలేదు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని ఆదుకోవాలని కార్మిక సంఘాలు గతంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించాయి. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఆర్టీసీని ఆదుకుంటామని పలుమార్లు ప్రకటించారు. కార్మిక సంఘాలను రద్దు చేయడం, పని భారం పెరగడంతో కొంతకాలంగా కార్మికులు ప్రభుత్వ వైఖరిపై అసంతృప్తితో ఉన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సర్కారు దిద్దుబాటు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఆర్టీసీని స్వాధీనం చేసుకుంటుందన్న ప్రకటన వెలువడిందని భావిస్తున్నారు. ప్రభుత్వం ఎట్టకేలకు ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో వారి కల నెరవేరినట్లయ్యింది.

సుమారు 2,800 మందికి ప్రయోజనం..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఆరు డిపోల పరిధిలో సుమారు 2,800 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇందులో 1,120 మంది కండక్టర్లు, 995 మంది డ్రైవర్లు, మూడు వందల మంది మెకానిక్‌లు, మరో నాలుగు వందల మంది క్లీనర్లు, అధికారులు, సిబ్బంది ఉన్నారు. వీరంతా త్వరలో ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొందనున్నారు. సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయడంతో తమ వేతనాలు కూడా పెరుగుతాయని కార్మికులు భావిస్తున్నారు.

ఖాకీ చొక్కా వదిలిన చక్రవర్తి గౌడ్!

- ఎంవీఐ ఉద్యోగానికి స్వచ్ఛందంగా విరమణ
- రాజకీయ ప్రవేశంపై ఊహాగానాలు



చక్రవర్తి గౌడ్

సాక్షి, కామారెడ్డి: గద్వాల జిల్లా ఎంవీఐగా పనిచేస్తున్న కామారెడ్డి పట్టణానికి చెందిన ఎంజీ చక్రవర్తి గౌడ్ సోమవారం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఈ విషయం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఆయన రాజకీయాల్లో చేరతారన్న ప్రచారం జరుగుతోంది.

గౌడ సామాజిక వర్గానికి చెందిన చక్రవర్తి గౌడ్‌కు రవాణా శాఖతో పాటు రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో సన్నిహిత సంబంధాలున్నాయి. ఆయన సోదరుడు ఎంజీ వేణుగోపాల్ గౌడ్ బీజేపీలో కొనసాగుతున్నారు. కాగా చక్రవర్తి గౌడ్ చాలాకాలంగా తన స్నేహితులతో కలిసి ఏర్పాటు చేసిన ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పేద పిల్లలకు ఉన్నత చదువుల కోసం చేయూతనందిస్తూ వస్తున్నారు. ఆయనకు గౌడ సామాజికవర్గంలో పట్టు ఉంది. హైదరాబాద్‌లోని గౌడ హాస్టల్‌కు ఆయ న ఇటీవలే అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చక్రవర్తి గౌడ్ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ కోసం రెండు నెలల క్రితమే దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. ప్రభు త్వం అనుమతి ఇవ్వడంతో సోమవారం ఆయన ఉద్యోగ విరమణ చేశారు. ఆర్థికంగా ఉన్నత కుటుంబం కావడంతో పాటు జిల్లాలో గౌడ సామాజిక వర్గం పెద్ద సంఖ్యలో ఉండడంతో ఆయన రాజకీయాల్లోకి రావడం కోసమే ఉద్యోగ విరమణ చేశారన్న ప్రచారం జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో రాజీ నామా చేసినందున ఆయన శాసనసభ ఎన్నికల బరిలో దిగుతారని కొందరు.. రాబోయే రోజుల్లో పట్టభద్రుల స్థానం నుంచి పోటీ చేయడానికి సన్నాహాలు చేసుకుంటారని మరికొందరు భావిస్తున్నారు.

మరికొందరు సైతం..

జిల్లాకు చెందిన పలువురు ఉన్నత ఉద్యోగులు రాజకీయాలపై ఆసక్తితో ఉన్నారు. పిట్లం మండల కేంద్రానికి చెందిన నవాబ్ శివకుమార్ గౌడ్ చంచల్‌గూడ జైల్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఆడపిల్లల రక్షణ విషయంలో స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి అనేక కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ పెద్దలతో సన్నిహిత సంబంధాలు ఉన్న ఆయనకు కూడా రాజకీయాలపై ఆసక్తి ఉంది. అవకాశం వస్తే ఎన్నికల బరిలో నిలవడానికి సిద్ధంగా ఉన్నారన్న ప్రచారం జరుగుతోంది. జుక్కల్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానంటూ ప్రధానోపాధ్యాయుడు సీతయ్య చెప్పుకుంటున్నారు. ఆయన ఇటీవల ఆ నియోజకవర్గంలో తిరుగుతున్నారు. ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో మరికొన్ని పేర్లు సైతం తెరపైకి వచ్చే అవకాశాలున్నాయి.

క్లుప్తంగా

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



బాన్సువాడ: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహద పడతాయని, ప్రతి కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని బీడీ వర్కర్స్ కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలపై వెళ్లేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. మహిళల రక్షణ కోసం షీటీంలు పని చేస్తున్నాయని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. 120 ఇళ్ల తనిఖీ చేసి, 30 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై దత్తాత్రిగౌడ్ తదితరులు ఉన్నారు.

ఇంటిపై కూలిన చెట్టు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): జంగమాయిపల్లిలో సోమవారం బోధనం భద్రయ్య ఇంటిపై చెట్టు కూలిందని గ్రామస్తులు తెలిపారు. ఈదురు గాలులతో పాటు వర్షం కురవడంతో ఇంటిపై చెట్టు పడిందని అన్నారు. దీంతో భద్రయ్య ఇంటి పైకప్పు దెబ్బతిన్నదని అన్నారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని బాధితుడు కోరుతున్నారు.

నిరుద్యోగులకు వరం 'సంకల్ప' పథకం

కామారెడ్డి అర్బన్: నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, శిక్షణ పొందడానికి సంకల్ప పథకం ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా ఉపాధి కల్పనాధికారి పి.మధుసూదన్‌రావు పేర్కొన్నా రు. సంకల్ప పథకం కింద కామారెడ్డిలో సోమవారం నిరుద్యోగులకు అవగాహన, నైపుణ్య సదస్సు నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ రామరాయలు, సమన్వయకర్త దుర్గారెడ్డి, మెప్మా ప్రాజెక్ట్ అధికారి శ్రీధర్‌రెడ్డి, ఎంజీఎంఎఫ్ ప్రద్యుమ్నరెడ్డిలు వివిధ పథకాలు, ఉచిత శిక్షణ, ఉపాధి పథకాలు, రుణాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న నిరుద్యోగులకు వివిధ నైపుణ్య సమాచారం ప్రతులను అందించారు.

తెయూ న్యాయశాస్త్ర విభాగాధిపతిగా ప్రసన్నరాణి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ న్యాయశాస్త్ర విభాగాధిపతి (హెచ్‌వోడీ)గా డాక్టర్ ప్రసన్నరాణి నియామకమయ్యారు. తెయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య ఎం యాదగిరి సోమవారం ప్రసన్నరాణికి నియామక ఉత్తర్వులను అందజేశారు. ప్రసన్నరాణికి న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ స్రవంతి, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా పదవీకాలం పొడిగింపు

నిజామాబాద్‌అర్బన్: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆరుట్ల రాజేశ్వర్ పదవీ కాలం పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన రెండేళ్ల పదవిలో కొనసాగనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని రాజేశ్వర్ సెక్రెటేరియట్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్
- ప్రజావాణికి 69 వినతులు



ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ చంద్ర మోహన్

కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అధికారులకు సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 69 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో 42 ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు సంబంధించినవే కావడం గమనర్హం. మిగితావి ఆయా శాఖలకు చెందిన ఫిర్యాదులు నమోదయ్యాయి. ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలన్నారు. భూ సమస్యల దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఎన్నికల విభాగం అధికారి సాయి భుజంగరావు, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కుటుంబ పోషణ భారమవుతోంది

- ఉమ్మడి జిల్లా పార్ట్‌టైం స్వీపర్ల సంఘం

తమ డిమాండ్‌లను వెంటనే నెరవేర్చాలని కోరుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉమ్మడి జిల్లా పార్ట్‌టైం స్వీపర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. కార్యాలయం ఎదుట కొద్దిసేపు ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ.. 40 ఏళ్లగా రూ.150 వేతనంతో స్వీపర్లుగా పనిచేస్తున్నామని, ప్రస్తుతం రూ.4 వేలు ఇస్తున్నారని దీంతో కుటుంబ పోషణ భారమవుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే తమను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించి రూ.27 వేల వేతనం చెల్లించాలని కోరారు. చనిపోయిన స్వీపర్ల స్థానంలో వారి వారసులను నియమించాలన్నారు. విద్యార్హతను బట్టి అటెండర్లు, సబార్డినేటర్లుగా నియమించాలన్నారు. అనంతరం ఏవో రవీందర్‌కు వినతి పత్రం అందజేశారు.

భిక్కనూర్ సర్పంచ్‌పై ప్రజావాణిలో ఫిర్యాదు



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న బీఎస్పీ నేతలు

కామారెడ్డి అర్బన్: భిక్కనూర్ శ్రీరాంనగర్ కాలనీలో గ్రామ పంచాయతీ 12 ఫీట్ల రోడ్డులో సర్పంచ్ తున్కి వేణు కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేశారని ఆరోపిస్తూ.. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బీఎస్పీ మండల శాఖ అధ్యక్షుడు డి.నవీన్‌తో పాటు పార్టీ ప్రతినిధులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మే నెలలో ప్రజావాణిలో జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే విచారణ జరపాలని కోరారు.

పంచాయతీ ఈవోపై చర్యలు తీసుకోవాలి

భిక్కనూరు: మండల కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా పంచాయతీ ఈవో పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ బీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. నిర్లక్ష్యం చేస్తున్న పంచాయతీ ఈవోను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నేతలు గంగల్ల రవి, కర్రొల్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ టికెట్ మాదిగలకే కేటాయించాలి



మద్నూర్(జుక్కల్): జుక్కల్ బీఆర్‌ఎస్ అసెంబ్లీ టికెట్ మాదిగ కులస్తులకు కేటాయించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలో బాబూ జగ్జీవన్‌రావ్ సంఘం మాదిగ దండోరా సభ్యులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ..జుక్కల్‌లో గతంలో చాలాసార్లు మాల సామాజికవర్గానికి వివిధ పార్టీలు అవకాశం ఇచ్చాయని ఈ సారి మాదిగ సామాజికవర్గానికి బీఆర్‌ఎస్ తరపున టికెట్ ఇవ్వాలని కోరారు. లచ్చయ్య, శివయ్య, సాయిలు, దత్తు, తదితరులున్నారు.

అంటరానితనాన్ని ప్రోత్సహిస్తే చట్టరీత్యా చర్యలు



పెద్దకొడప్‌గల్(జుక్కల్): అంటరానితనాన్ని ప్రోత్సహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆర్‌ఐ అంజయ్య అన్నారు. సోమవారం వడ్లంలో పౌర హక్కుల చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పౌరునికి మానవ హక్కుల చట్టం, అట్రాసిటీ కేసులపై అవగాహన ఉండాలన్నారు.

3లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, 1వ, 2వ, 3వ, 4వ సెమిస్టర్ (2019, 2020, 2021, 2022 బ్యాచ్‌ల)బ్యాక్‌లాగ్ పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లింపు తుది గడువు ఆగస్టు 3 అని కంట్రోలర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో ఆగస్టు 4వరకు చెల్లించే అవకాశం ఉందన్నారు.

ఇంజినీర్, కాంట్రాక్టర్‌పై స్పీకర్ ఆగ్రహం



పబ్లిక్‌అండ్‌హెల్త్ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్పీకర్ పోచారం

బాన్సువాడ: బాన్సువాడలో చేపడుతున్న మున్సిపల్ భవన నిర్మాణంపై పబ్లిక్ అండ్ హెల్త్ శాఖ డీఈ, ఏఈ, కాంట్రాక్టర్‌పై స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్ కార్యాలయం ముందు రూ. 2 కోట్ల నిధులతో మున్సిపల్ నూతన భవన నిర్మాణం చేపడుతున్నారు. స్వయంగా రెండు సార్లు స్పీకర్ స్థలాన్ని పరిశీలించి భవనం ఎలా నిర్మించాలో అధికారులకు, కాంట్రాక్టర్‌కు వివరించారు. స్పీకర్ చెప్పిన చోట కాకుండా వేరే చోట భవనం నిర్మించడంతో ఇప్పటికే రూ.2 కోట్ల నిధులు పూర్తయ్యాయి. అయినా భవనం పనులు ఇంకా మిగిలిపోవడంతో డీఈ సంతోష్, ఏఈ శ్రీకాంత్‌పై స్పీకర్ మండిపడ్డారు. రూ.2 కోట్లతో కామారెడ్డిలో నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ భవనం పూర్తయిందని, బాన్సువాడలో రూ.కోటి నిధులతో ఆర్డీవో కార్యాలయ భవన నిర్మాణం పూర్తియిందని స్పీకర్ అన్నారు. కానీ అధికారులు, కాంట్రాక్టర్ చేసిన తప్పిదంతో భవనం పూర్తి కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భవనం పూర్తి కావాలంటే మరో రూ.కోటి నిధులు అవసరముంటుందని అధికారులు చెప్పడంతో తన వద్ద మాత్రం నిధులు లేవని, మున్సిపాలిటీ నుంచి సమకుర్చుకోవాలని అన్నారు. మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, అంజిరెడ్డి, ఎజాస్, కృష్ణరెడ్డి, శ్రావణ్, గోపాల్‌రెడ్డి ఉన్నారు.

బేబీ ఫీడింగ్ గది ప్రారంభం



బాన్సువాడ: బాన్సువాడ బస్టాండ్‌లో రాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బేబీ ఫీడింగ్ గదిని సోమవారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ పోచారం మాట్లాడుతూ.. రాం ఫౌండేషన్ వ్యవస్థాపకులు, కండక్టర్ నాగరాజు ఏర్పాటు చేసిన బేబీ ఫీడింగ్ గది ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. చిన్న పిల్లల ఏడుస్తూంటే బస్టాండ్‌లో చాలా మంది ఇబ్బందులు పడుతుంటారని, వారి అవసరాలని గుర్తించి ఫీడింగ్ గదిని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. నాగరాజును అభినందించారు. ఆయన వెంట డీఎం సదాశివ్, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, ఎజాస్, వెంకట్‌రాంరెడ్డి, తదితరులు ఉన్నారు.

మంచిప్పలో కేంద్ర బృందం తనిఖీ



మోపాల్(నిజామాబాద్‌రూరల్) : మండలంలోని మంచిప్పలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో భాగంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ కేంద్ర బృందం సోమవారం పర్యటించింది. ఈజీఎస్ నిధులతో గ్రామంలో చేపట్టిన పనుల వివరాలను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, సామూహిక ఇంకుడు గుంతలు, రైతు వేదిక, సబ్ సెంటర్, డ్రెయినేజీలు, రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను తనిఖీ చేశారు. పీడీ ఫయాజ్, ఏపీడీ ఓం పాల్ ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు. అంతకుముందు కేంద్ర బృందాన్ని జీపీలో సర్పంచ్ సిద్ధార్థ, ఉపసర్పంచ్ జగదీష్, ఎంపీడీఓ లింగం సన్మానించారు. ఎంపీవో ఇక్బాల్, ఏపీవో సునీత, వీడీసీ అధ్యక్షుడు నవీన్, టీఏలు, ఎఫ్ఏలు, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు. 2016లో ఇంకుడు గుంతను తవ్వకుంటే ఇప్పటికీ తనకు పేమెంట్ ఇవ్వలేదని గ్రామానికి చెందిన సాయిరాం పీడీ ఫయాజ్‌కు వినతిపత్రం అందజేశారు.

'నిధులివ్వకపోతే రాజీనామా చేస్తా'



నిధుల వివరాలు తెలుపుతున్న ఎంపీటీసీ వినోద

మాచారెడ్డి: తనకు రావాల్సిన ఎంపీటీసీ నిధులను మంజూరు చేయకుంటే పదవికి రాజీనామా చేస్తానని మాచారెడ్డి ఎంపీటీసీ సభ్యురాలు రావుల వినోద స్పష్టం చేశారు. ఆమె సోమవారం మాట్లాడారు. 6 వేల 5 వందల జనాభా ఉన్న గ్రామానికి నాలుగు సంవత్సరాలుగా రూ.3 లక్షల 50 వేలు మాత్రమే మంజూరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడువేల జనాభా కలిగిన జీపీలకు ఇప్పటివరకు రూ.15 లక్షల వరకు మంజూరు చేశారని తనపై ఇంత వివక్ష ఎందుకని ప్రశ్నించారు. రెండు రోజుల్లో నిధులు మంజూరు చేయకపోతే పదవికి రాజీనామా చేసి ఆర్డీవోకు అందజేస్తానని తెలిపారు.

విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలు వెనక్కి తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో డీఈవో అనుమతి లేకుండా విద్యార్థి సంఘాలు, మీడియా ప్రతినిధులను లోనికి అనుమతించరాదని విద్యాశాఖ డైరెక్టర్ జారీ చేసిన ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని తెయూ ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మినీ సెమినార్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు లవిశెట్టి ప్రసాద్, కె శ్రీశైలం మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు బయటకు తెలుస్తాయనే భయంతోనే ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఇలాంటి ఆదేశాలు జారీ చేశారని విమర్శించారు. విద్యా సంవత్సరం ప్రారంభమై 50 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు విద్యార్థులకు యూనిఫామ్స్ ఇవ్వలేదన్నారు. పాఠశాలల్లో వసతుల కల్పన కోసం మన ఊరు– మన బడి పథకం కింద మంజూరు చేసిన నిధులు కాంట్రాక్టర్ల జేబులు నింపడానికి ఉపయోగపడ్డాయని విమర్శించారు. వెంకటేష్, సంధ్యారెడ్డి, నవీన్, చిత్ర, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తెయూ రిజిస్ట్రార్ యాదగిరి, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని తెయూ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎం యాదగిరిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం రిజిస్ట్రార్ చేతుల మీదుగా డిమాండ్లతో కూడిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎల్‌బీ రవికుమార్, అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, బికోజీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు వ్యవస్థ అనే పదాలు లేకుండా చేస్తానని గత ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం తమను రెగ్యులరైజ్ చేయాలన్నారు. నరేష్, రవీందర్, రమేష్, శ్రీధర్, గణేశ్, దిగంబర్, క్రాంతి, పుణ్యవర్ధన్, మమత, శోభారాణి, పద్మ, రాము పాల్గొన్నారు.

'నాకు నోటీసులు రాలేదు'

నిజామాబాద్ సిటీ: జీజీహెచ్‌లో జరిగిన రెమిడిసివర్ ఇంజెక్షన్ల మిస్సింగ్ వ్యవహారంలో లోకాయుక్త ఎదుట సమాధానం చెప్పమని తనకు ఎలాంటి నోటీసులు రాలేదని జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ వెల్లడించారు.

జూలై 28న తాను లోకాయుక్త ఎదుట హాజరు కావాలని ఎవరు నోటీసులు జారీ చేయలేదని చెప్పారు. ఈ వ్యవహారంలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు నోటీసులు వెళ్తాయని, తనకు నేరుగా నోటీసులు జారీ కావన్నారు. డీఎంఈ ఆదేశాలు జారీ చేస్తే తాను లోకాయుక్త ఎదుట హాజరవుతానని చెప్పారు. విషయం తె లియని సీసీఎస్ ప్రతినిధులు సోషల్ మీ డియాలో ప్రచారం చేయటం సరికాదన్నారు.

వర్సిటీలో క్రీడా సౌకర్యాలు మెరుగు పరచాలి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థులకు మెరుగైన క్రీడా సౌకర్యాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ వర్సిటీ ఇన్‌చార్జి తరుణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ బీఆర్‌నేతను కలిసి వినతి పత్రం అందజేశారు. వర్సిటీలో చదువుకుంటున్న విద్యార్థులు అనేక పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారని, వారు రన్నింగ్ తో పాటు ఇతర క్రీడల్లో నైపుణ్యం మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. క్యాంపస్ మైదానంలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అన్ని రకాల క్రీడలకు సంబంధించిన సామగ్రిని అందుబాటులో ఉంచాలని కోరారు.

క్రైం కార్నర్

సెల్‌ఫోన్ దుకాణాల్లో చోరీ



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ కొత్తబస్టాండ్ ప్రాంతంలో వెంకటేశ్వర టాకీస్ సందులో ఆదివారం రాత్రి రెండు సెల్‌ఫోన్ దుకాణాల్లో చోరీ జరిగింది. మొత్తం ఐదు దుకాణాల్లో చోరీకి ప్రయత్నించగా మూడు దుకాణాల షెటర్లు తెరుచుకోకపోవడంతో ఈశ్వరీ, మోసిన్ సెల్‌ఫోన్ దుకాణాల్లో దొంగతనం చేశారు. ఈశ్వరి సెల్‌పాయింట్‌లో నాలుగు ఫోన్లు, రూ.10వేలు, మోసిన్ షాప్‌లో 15 స్మార్ట్‌ఫోన్‌లు, రూ.70 వేల నగుదు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. పోలీసుల ఘటన స్థలాన్ని పరిశీలించారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

మద్నూర్: మద్నూర్‌లోని ఉర్దూ మీడియం పాఠశాలలో జూలై 26న జరిగిన బ్యాటరీల దొంగతనం కేసులో మండలానికి చెందిన ఓ బాలుడిని సోమవారం జువైనల్ జస్టిస్ బోర్డ్ ఎదుట ప్రవేశపరిచి అబ్జర్వేషన్ హోమ్‌కి పంపినట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. బాలుడికి సహకరించిన వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు. సదరు బాలుడు గతంలో ఎంపీడీవో కార్యాలయంలో సెంట్రింగ్ బాక్సులు చోరీ చేసినట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు.

పోలీసుల అదుపులో నిందితులు!

రెంజల్: బాలికలను కిడ్నాప్ చేసిన ఇద్దరు యువకులకు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు గ్రామస్తుల ద్వారా తెలిసింది. గత నెల 18న రెంజల్ ఆదర్శ పాఠశాలలో చదువుతున్న దూపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థినులను అదే గ్రామానికి చెందిన యువకులు కిడ్నాప్ చేసినట్లు బాలికల తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిడ్నాప్ కేసు నమోదు చేసిన పోలీసులు బాలికల కోసం దర్యాప్తు ప్రారంభించారు. అనంతపురం జిల్లాలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు బాలికలతో పాటు కిడ్నాప్ చేసిన యువకులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయమై రెంజల్ ఎస్సై ఉదయ్‌కుమార్‌ను వివరణ కోరగా కేసును సీఐ దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు.

నకిలీ గుళికలు అమ్మిన వ్యక్తి అరెస్ట్

- రూ.39కి కొని రూ.650కి విక్రయం
- రైతుల ఫిర్యాదుతో వెలుగులోకి..




రైతులతో మాట్లాడుతున్న ఫటేరా కంపెనీ ప్రతినిధులు, పోలీసులు

బాన్సువాడ: బీర్కూర్ మండలం తిమ్మాపూర్‌లో నకిలీ గుళికల మందు విక్రయించిన వ్యక్తిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. మండలంలోని తిమ్మాపూర్‌లో ఉన్న శ్రీ లక్ష్మీ ఫర్టిలైజర్ యజమాని కృష్ణ రెండేళ్లుగా ఢిల్లీ నుంచి తెచ్చిన నకిలీ ఫటేరా గుళికల మందులు రైతులకు విక్రయిస్తున్నాడు. ఆ గుళికలు వాడినా పంటలో ఎలాంటి ఎదుగుదల లేకపోవడంతో తిమ్మాపూర్, నస్రూల్లాబాద్ మండలం మిర్జాపూర్, వీరాపూర్ గ్రామాల రైతులు ఫటేరా కంపెనీ ప్రతినిధులకు ఫిర్యాదు చేశారు. దీంతో కంపెనీ నుంచి వచ్చిన ప్రతినిధులు ఆయా గ్రామాల్లో రైతుల వద్దకు వెళ్లి వారు వాడిన ఫటేరా గుళికల మందును పరిశీలించారు. ఫటేరా పేరుతో ఉన్న నకిలీ గుళికల మందులను గుర్తించారు. ఈ గుళికల మందులు అమ్మిన ఫర్టిలైజర్ యజమాని కృష్ణను పట్టుకుని అడుగగా రెండేళ్లుగా ఢిల్లీ నుంచి నకిలీ గుళికల మందు తీసుకు వస్తున్నట్లు ఒప్పుకున్నాడు. 4 కిలోల ప్యాకెట్ రూ.39కే కొని రైతులకు రూ.650కు విక్రయిస్తున్నానని అంగీకరించాడు. ఫర్టిలైజర్ దుకాణంలో ఉన్న 26 నకిలీ గుళికల ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కంపెనీ ప్రతినిధులు ఏవో కమల సమక్షంలో విచారించి ఫర్టిలైజర్ యజమాని కృష్ణపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అంత్యక్రియలకు వెళ్తుండగా ఆటో బోల్తా

- పది మందికి గాయాలు



ధ్వంసమైన ఆటో

జక్రాన్‌పల్లి: మండలంలోని సికింద్రాపూర్ గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పది మందికి స్వల్ప గాయాలయ్యాయి. కేశ్‌పల్లిలో అంత్యక్రియలకు వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. కేశ్‌పల్లి గ్రామానికి చెందిన మున్నూరు రాములు వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. సోమవారం నిజామాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాములు అంత్యక్రియలకు ఆర్మూర్ పట్టణంలోని పిప్రి గల్లీకి చెందిన తొమ్మిది మంది ఆటోను కిరాయికి మాట్లాడుకుని కేశ్‌పల్లికి బయలుదేరారు. ఈ క్రమంలో సికింద్రాపూర్ గ్రామ శివారులో ఆటో అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న పది మందికి గాయాలయ్యాయి. ఏఎస్సై వెంకట్‌కుమార్ సిబ్బందితో వెళ్లి గాయాలైన వారిని ఆర్మూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

నేరాల నియంత్రణకు సహకరించాలి



కామారెడ్డి క్రైం: నేరాల నియంత్రణకు సహకరించాలని కామారెడ్డి డీఎస్పీ ప్రకాష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి సాయి సద్గురు కాలనీలో సోమవారం సాయంత్రం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పరిసర ప్రాంతాలను, వాహనాలను త నిఖీ చేశారు. కాలనీవాసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రూరల్ సీఐ శ్రీనివాస్, కౌన్సిలర్ కృష్ణాజీరావు, దేవునిపల్లి ఎస్సైలు రాజు, నర్సయ్య పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మద్నూర్: చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని బిచ్కుంద సీఐ కృష్ణ అన్నారు. సలాబత్‌పూర్‌లో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో ఆయన పా ల్గొని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ మ ధ్య కాలంలో సైబర్ మోసాలు చాలా జరుగుతున్నా యని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రయాణాలు సాగించాలని కోరారు. సరైన పత్రాలు లేని 22 బైక్‌లు, మూడు ఆటోలను సీజ్ చేసినట్లు ఆయన చెప్పారు.